# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | గురువారం 24, సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1




## జూరాలకు 3 టీఎంసీల నీరు

- విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం
- విడతల వారీగా నీటిని విడుదల చేసేందుకు డీకే శివకుమార్ ఓకే
- జూరాల కింద నీటి అవసరాలను వివరించిన తెలంగాణ ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి పాలమూరు మంత్రుల నేతృత్వంలో భేటీ
- రైతుల సమస్యలను కర్ణాటక సీఎం దృష్టికి తీసుకెళ్లిన నేతలు

2



సీఈసీ, ఈసీల నియామకంపై
## కుదరని ఏకాభిప్రాయం

- సుప్రీంకోర్టు ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు
- ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదాలు
- 2023 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- సీజేఐని ఎంపిక కమిటీ నుంచి తప్పించడంపై అభ్యంతరం

2




2

ఈగల్ ఫోర్స్‌కు
## జాతీయ అవార్డు

- ఫ్లోరెస్ ద్వీపంలో 7.7 తీవ్రతతో ప్రకంపనలు
- భూమికి కేవలం 24 కిలోమీటర్ల లోతులో కేంద్రం
- ప్రకంపనల ధాటికి ఇద్దరు వ్యక్తులు మృతి
- తీర ప్రాంతాలకు అత్యవసర సునామీ హెచ్చరికలు
- 6.1 తీవ్రతతో సంభవించిన వరుస ప్రకంపనలు
- భయంతో ఇళ్లను వదిలి కొండ ప్రాంతాలకు పరుగు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు



# కేటీఆర్ చరిత్ర తెలుసుకో

- బషీర్‌బాగ్ కాల్పులప్పుడు కేసీఆర్ టీడీపీలోనే ఉన్నారు
- బీఆర్ఎస్ నేతలను పవర్ స్టేషన్ల వద్దకు పంపడం రాజకీయ డ్రామా
- విద్యుత్ ఛార్జీల కోసం కేసీఆర్ పోరాడారనడం అవాస్తవం
- రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దే
- బీఆర్ఎస్ హయాంలో డిస్కంలపై రూ.81 వేల కోట్ల అప్పులు
- విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయి
- యాదాద్రి ప్రాజెక్టును నామినేషన్ పద్ధతిలో అప్పగించారు
- విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల్లో అవినీతి
- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్, (ప్రజాస్వరం):
కేటీఆర్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్యుత్ అంశంపై బీఆర్ఎస్ రాజకీయ డ్రామా చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీ నేతలను ఆరు బృందాలుగా పవర్ స్టేషన్ల వద్దకు పంపుతున్నారని అన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. విద్యుత్ ఛార్జీల కోసం కేసీఆర్ పోరాడారని కేటీఆర్ చెప్పడం వాస్తవం కాదని చామల అన్నారు. 2000లో బషీర్‌బాగ్ కాల్పులు జరిగిన సమయంలో కేసీఆర్ టీడీపీలోనే ఉన్నారని గుర్తుచేశారు. 2001లో మిగతా 2 లో..

### టార్గెట్
# కేటీఆర్?

బీఆర్ఎస్ వ్యూహాన్నే రివర్స్‌లో ప్రయోగిస్తున్న సీఎం?

కీలక నియోజకవర్గాలపై రేవంత్ స్పెషల్ ఫోకస్

కేటీఆర్ ఇలాకాలో సీఎం భారీ బహిరంగ సభ

ఈ నెల 30న సిరిసిల్లకు రేవంత్‌రెడ్డి

సిరిసిల్లతో పాటు సిద్దిపేటపైనా సీఎం నజర్

వరుస సభల వెనుక రాజకీయ వ్యూహం ఏంటి?

ప్రత్యర్థుల అడ్డాలోనే సీఎం రాజకీయ సమరం

కీలక నేతల నియోజకవర్గాల్లో సభలకు ప్లాన్

సైలెంట్‌గా ఉన్న సీఎం.. ఇప్పుడు స్పీడ్ పెంచారా?

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భారీ సభలకు సన్నాహాలు

రాజకీయ ప్రత్యర్థులకు రేవంత్ కొత్త వ్యూహం?

సిరిసిల్ల సభతో మొదలుకానున్న సీఎం టూర్‌లు

"అన్ని లెక్కలు తేలుస్తా" అన్న రేవంత్.. కార్యాచరణ షురూ

నియోజకవర్గాల వారీగా సీఎం రాజకీయ లెక్కలు

బీఆర్ఎస్ కీలక నేతల కంచుకోటలపై కాంగ్రెస్ ఫోకస్



హైదరాబాద్, (ప్రజాస్వరం):
నీవు నేర్పిన విద్యయే కదా... నీరజాక్షా అన్నట్టు తెలంగాణ సీఎం... రాజకీయ ప్రత్యర్థులతో అంటున్నారా? వాళ్ళ వ్యూహాన్నే రివర్స్‌లో వాళ్ళ మీదికే ప్రయోగిస్తున్నారా...? కీలకమైన నియోజకవర్గాల్లో బహిరంగ సభల ప్లాన్స్ అందుతో భాగమేనా?వరుస సభల వెనక వ్యూహం ఏంటి..!? ముఖ్యమంత్రి రాజకీయ లెక్కలు ఎలా ఉన్నాయంటున్నారు?
రాజకీయ వ్యూహాలకు గట్టిగా సానపట్టే పనిలో బిజీగా ఉన్నారట తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. ముల్లును ముల్లుతోనే మిగతా 2 లో..

# వినాయక నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

- హైదరాబాద్‌లో 20 వేల మంది పోలీసులతో భద్రత
- ఖైరతాబాద్, బాలాపూర్ శోభాయాత్రలకు ప్రత్యేక ఏర్పాట్లు
- నిమజ్జనాన్ని పర్యవేక్షించేందుకు 24 డ్రోన్లు
- 10 వేల సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలతో నిఘా
- పాత, నకిలీ వీడియోలు వైరల్ చేస్తే కఠిన చర్యలు
- డీజేలు, వల్గర్ పాటలు, అసభ్య నృత్యాలపై కఠినంగా వ్యవహరిస్తాం
- చైన్ స్నాచింగ్, చోరీల నివారణకు ప్రత్యేక క్రైమ్ టీమ్‌లు
- మహిళల భద్రతకు షీటీమ్‌లతో నిఘా

హైదరాబాద్, (ప్రజాస్వరం):
హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం, శోభాయాత్రలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. నగరంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిమజ్జనం, శోభాయాత్రలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో 20 వేల మంది పోలీసులు విధుల్లో ఉంటారని సీపీ తెలిపారు. ఇతర జిల్లాల పరిధిలో మరో 8,400 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ శోభాయాత్రలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మార్గాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లోనూ అదనపు నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నిమజ్జనం, శోభాయాత్రలను పర్యవేక్షించేందుకు మిగతా 2లో..




### కాంగ్రెస్ వచ్చాక కరెంట్
# పోయింది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు పెరిగాయని ఆరోపణ

ఎల్‌నినో కాదు.. కాంగ్‌నినో వల్లే కరెంట్ కోతలని వ్యాఖ్య

బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అద్భుతంగా నడిచిందని వెల్లడి

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉన్నాయని ఆరోపణ

జెన్‌కోలో బొగ్గు నిల్వలు లేవని విమర్శ

సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ

బొగ్గు ఉంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఎందుకు మూసివేస్తున్నారని ప్రశ్న



హైదరాబాద్, (ప్రజాస్వరం):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి గతంలో తాము చేసిన హెచ్చరికలకు అనుగుణంగానే మారిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని తాము గతంలో చెప్పామని, ఇప్పుడు అదే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది' అంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో మిగతా 3 లో..

# రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- ఈ నెలాఖరులోగా పీఆర్సీ నివేదిక వచ్చే అవకాశం
- 3.46 శాతం డీఏ ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం
- మరో 2.74 శాతం డీఏ ఇచ్చేందుకు అంగీకారం
- మూడో డీఏను 3..4 నెలల్లో ఇస్తామని హామీ
- ఉద్యోగ సంఘాలతో సీఎస్ సంజయ్ జాజు సమావేశం
- పీఆర్సీ నివేదిక పురోగతిపై ప్రధానంగా చర్చ
- సీపీఎస్ రద్దుపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- వివిధ రాష్ట్రాల్లో పర్యటించనున్న కమిటీ
- ఒకటో తేదీన జీతాల చెల్లింపుతో మరో సమస్య పరిష్కారమైందన్న ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, (ప్రజాస్వరం):
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలు, పీఆర్సీ నివేదిక పురోగతిపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో



# పీవోకేలో పౌరులపై కాల్పులు ఆపాలి

- ఐరాస వేదికగా తస్లీమా అక్తర్
- పాకిస్థాన్ భద్రతా దళాల తీరుపై యూఎన్‌హెచ్‌ఆర్‌సీలో ఆందోళన
- శాంతియుత నిరసనలను అణచివేస్తున్నారని ఆరోపణ
- వందలాది మంది కార్యకర్తల అరెస్టు
- కీలక నేతలను నిర్బంధించారని వెల్లడి
- ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని ఆరోపణ
- హింసాత్మక ఘర్షణల్లో పలువురు మృతి
- పౌరుల హత్యలపై స్వతంత్ర దర్యాప్తునకు డిమాండ్
- సమాచార వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి
- యూఎన్‌హెచ్‌ఆర్‌సీ తక్షణమే జోక్యం చేసుకోవాలని పిలుపు
- జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వ్యాఖ్య



హైదరాబాద్, (ప్రజాస్వరం):
పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో మానవ హక్కుల పరిస్థితిపై జమ్మూకశ్మీర్‌కు చెందిన సామాజిక కార్యకర్త తస్లీమా అక్తర్ ఐరాస వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్న పౌరులపై పాకిస్థాన్ భద్రతా దళాలు కాల్పులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పౌరుల మరణాలపై మిగతా 3 లో..

# జూరాలకు 3 టీఎంసీల నీరు

- విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం
- విడతల వారీగా నీటిని విడుదల చేసేందుకు డీకే శివకుమార్ ఓకే
- జూరాల కింద నీటి అవసరాలను వివరించిన తెలంగాణ ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి పాలమూరు మంత్రుల నేతృత్వంలో భేటీ
- రైతుల సమస్యలను కర్ణాటక సీఎం దృష్టికి తీసుకెళ్లిన నేతలు
- కర్ణాటక ఇరిగేషన్ అధికారులతోనూ చర్చలు
- జూరాల ఆయకట్టు అవసరాలను వివరించిన తెలంగాణ ప్రతినిధులు
- నీటి విడుదలపై సానుకూలంగా స్పందించిన కర్ణాటక ప్రభుత్వం
- విడతల వారీగా నీటిని విడుదల చేయనున్న కర్ణాటక
- జూరాల ఆయకట్టు రైతులకు ఊరట కలిగించే నిర్ణయం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. విడతల వారీగా నీటిని విడుదల చేయడానికి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమ్మతి తెలిపినట్లు తెలంగాణ ప్రజాప్రతినిధులు వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కర్ణాటక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాప్రతినిధులు కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఆ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులతో మరోసారి సమావేశమయ్యారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి లభ్యత, ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు అవసరాలు, ప్రస్తుత పరిస్థితులను ఈ సందర్భంగా వివరించారు.జూరాలపై ఆధారపడిన రైతులకు సాగునీటి అవసరాలు ఉన్నాయని, ప్రాజెక్టులో తగినంత నీరు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలంగాణ ప్రతినిధులు కర్ణాటక సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రాజెక్టు కింద సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేయాలని కోరారు.

తెలంగాణ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. విడతల వారీగా మొత్తం 3 టీఎంసీల నీటిని జూరాల వైపు విడుదల చేసేందుకు అంగీకారం తెలిపినట్లు నేతలు వెల్లడించారు. నీటి విడుదలకు సంబంధించి కర్ణాటక ఇరిగేషన్ అధికారులకు కూడా సీఎం సూచనలు చేసినట్లు తెలిపారు.

జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి నీరు విడుదలైతే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం పెరగడంతో సాగునీటి అవసరాలను తీర్చేందుకు కొంత వెసులుబాటు లభించనుంది. నీటి విడుదల ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఏయే విడతల్లో ఎంత మొత్తంలో విడుదల చేస్తారనే వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించాల్సి ఉంది.



# టార్గెట్ కేటీఆర్?

**మొదటిపేజీ తరువాయి**

తీయాలన్నట్టు బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడానికి గతంలో ఆ పార్టీ అనుసరించిన వ్యూహాన్నే రివర్స్‌లో అప్లయ్ చేయాలనుకుంటున్నారా అన్న చర్చలు జరుగుతున్నాయి రాజకీయవర్గాల్లో. ప్రధానంగా ఆ పార్టీ ముఖ్యుల్ని కట్టడి చేయడానికి స్పెషల్ స్కెచ్ వేస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న సీఎం ఇప్పుడు ఆ నియోజక వర్గాలపై ఫోకస్ పెట్టడం వెనక గట్టి వ్యూహమే ఉందని అంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లకు ఈనెల 30న వెళ్ళబోతున్నారు సీఎం. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నారు. సిరిసిల్లతో పాటు... సిద్దిపేటకు వస్తా... అన్ని లెక్కలు తేలుస్తానంటూ ఇటీవల ప్రకటించారు ముఖ్యమంత్రి. దాంట్లో భాగంగా సిరిసిల్ల సభ తేదీ ఖరారైంది.

అలాగే... వచ్చేనెల రెండో వారంలో సిద్దిపేటలో కూడా భారీ బహిరంగ సభ పెట్టాలనుకుంటున్నట్టు సమాచారం. అలాగే... అధికారులు అసైన్డ్ భూముల లెక్కలు తేల్చే పనిలో ఉన్నారట. ఇక ఆ తర్వాత గజ్వేల్‌లో సభ ప్లాన్ చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా...బీఆర్ఎస్‌లోని ముగ్గురు కీలక నాయకుల నియోజకవర్గాల్లో బహిరంగ సభలు పెట్టి అక్కడి కాంగ్రెస్ క్యాడర్‌ని యాక్టివేట్ చేసే పనిలో సీఎం ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. గతంలో బీఆర్ఎస్ కూడా... ప్రత్యర్థి పార్టీలో ఉన్న ముఖ్యమైన నాయకుల నియోజకవర్గాలపై ఎక్కువ ఫోకస్ పెట్టేది. రాజకీయంగా వాళ్లను నియోజకవర్గానికే పరిమితం చేసే వ్యూహాన్ని అమలు చేసేది. సేమ్ అదే స్కెచ్‌ని ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేసే పనిలో పడ్డట్టు భావిస్తున్నాయి రాజకీయవర్గాలు. సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లో అమలు చేయడంతో పాటు... కాంగ్రెస్‌లోని బలమైన నాయకులకు ఈ నియోజకవర్గాల బాధ్యతలను ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

అభివృద్ధితో మొదలుపెట్టి... తర్వాత రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో ఉన్నారట. వరుసగా ఆ మూడు నియోజకవర్గాల మీద ఫోకస్ చేయటంతో పొలిటికల్ అటెన్షన్ కూడా వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాలన్నిటిని కొలిక్కి తీసుకురావడం... తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి తలమునకలైనట్టు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది.




# వినాయక నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

**మొదటిపేజీ తరువాయి**

ఈసారి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను కూడా వినియోగిస్తున్నట్లు సజ్జనార్ చెప్పారు. 24 డ్రోన్ల ద్వారా నిమజ్జన కార్యక్రమాలను పరిశీలిస్తామని తెలిపారు. నగరంలోని 10 వేల సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామని వెల్లడించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.

వినాయక చవితి వేడుకలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు వైరల్ అయ్యాయని సీపీ తెలిపారు. పాత వీడియోలను ప్రస్తుత ఘటనలకు సంబంధించినవిగా పేర్కొంటూ ప్రచారం చేయడం, ఉద్దేశపూర్వకంగా నకిలీ వీడియోలను పోస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు, సందేశాలను పరిశీలించకుండా నమ్మవద్దని సూచించారు.

గణేశ్ మండపాల వద్ద వల్గర్ పాటలు, అసభ్యకర నృత్యాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయని సజ్జనార్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలపై పోలీసులు నిఘా ఉంచుతారని చెప్పారు. నిమజ్జనం వేడుకల్లో డీజేలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. 25 క్రైమ్ విభాగాల బృందాలు నిమజ్జనం, శోభాయాత్రల విధుల్లో ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్, ఇతర చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో పాటు నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని సజ్జనార్ చెప్పారు. మహిళలపై వేధింపులు, అసభ్య ప్రవర్తనకు పాల్పడే వారిని గుర్తించేందుకు షీటీమ్‌లు రంగంలో ఉంటాయని తెలిపారు. రద్దీ ప్రాంతాలు, శోభాయాత్ర మార్గాల్లో మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు.

ఖైరతాబాద్ గణేశ్ దర్శనానికి బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని సీపీ తెలిపారు. నిమజ్జనం నేపథ్యంలో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో ఎల్లుండి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఈ నెల 25న ప్రైవేటు బస్సులు, ఇతర ప్రైవేటు ట్రక్కులను నగరంలోకి అనుమతించబోమని వెల్లడించారు.

నిమజ్జనం, శోభాయాత్ర సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు మార్గాలను ముందుగానే తెలుసుకుని ప్రయాణాలు చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం వేడుకలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా పీఆర్‌సీ నివేదికతో పాటు డీఏలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

పీఆర్‌సీ నివేదిక ఈ నెలాఖరు నాటికి వచ్చే అవకాశం ఉందని సీఎస్ తమకు తెలిపినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చెప్పారు. నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. పీఆర్‌సీ ప్రక్రియ పూర్తయితే ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

మూడు డీఏలు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరినట్లు నేతలు తెలిపారు. ప్రస్తుతం రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇప్పటికే 3.46 శాతం డీఏను ప్రభుత్వం ప్రకటించిందని, మరో 2.74 శాతం డీఏను ఇచ్చేందుకు అంగీకరించిందని చెప్పారు. మూడో డీఏను కూడా 3 నుంచి 4 నెలల్లో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు.

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి డీఏల చెల్లింపు అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు వారు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు కరవుభత్యం అందడం అవసరమని, అందుకే పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ప్రభుత్వం రెండు డీఏలపై సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దు అంశంపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలుపై అధ్యయనం చేసేందుకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పెన్షన్ విధానాలను పరిశీలించి, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనుందని చెప్పారు.

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవడాన్ని కూడా ఉద్యోగ సంఘాల నేతలు ప్రస్తావించారు. గతంలో ఒకటో తేదీన జీతాలు పొందేందుకు తాము పోరాటం చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని వారు పేర్కొన్నారు.

పీఆర్‌సీ నివేదికతో పాటు డీఏలు, పెన్షన్ విధానంపై తీసుకోబోయే నిర్ణయాలపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై తదుపరి చర్యలను పరిశీలిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# సీఈసీ, ఈసీల నియామకంపై కుదరని ఏకాభిప్రాయం

- సుప్రీంకోర్టు ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు
- ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదాలు
- 2023 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- సీజేఐని ఎంపిక కమిటీ నుంచి తప్పించడంపై అభ్యంతరం
- ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రికి చోటు కల్పించిన చట్టం
- ఈసీ స్వతంత్రతపై జస్టిస్ దీపాంకర్ దత్తా ఆందోళన
- విస్తృత ధర్మాసనం అవసరమన్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ
- విషయాన్ని సీజేఐ ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తుల నిర్ణయం
- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకు మార్గం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించాలా అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చివరకు తదుపరి నిర్ణయం కోసం ఈ అంశాన్ని సీజేఐ ఎదుట ఉంచాలని ఇద్దరూ నిర్ణయించారు.

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టం ప్రస్తుతం సవాల్ ఎదుర్కొంటోంది. ఈ చట్టం ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రికి స్థానం కల్పించింది. దీంతో ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో పాటు ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు.

ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం విచారించింది. ఐదు రోజుల పాటు వాదనలు విన్న అనంతరం ఈ కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలా అనే అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలకు వచ్చారు.

జస్టిస్ దీపాంకర్ దత్తా ఎన్నికల సంఘం స్వతంత్రత, తటస్థతపై ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహించాల్సిన సంస్థ నియామక ప్రక్రియలో ప్రజలకు కూడా దాని స్వతంత్రతపై నమ్మకం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. 2023 చట్టం ఆ రాజ్యాంగ ప్రమాణాలను అందుకుంటుందా అనే ప్రశ్నను లేవనెత్తారు.

ఎంపిక కమిటీలో ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రి ఉండటంపై కూడా జస్టిస్ దత్తా ప్రస్తావించారు. ప్రభుత్వంలో సామూహిక బాధ్యత అనే సూత్రం కారణంగా ప్రధాని నామినేట్ చేసిన మంత్రి ఆయనతో విభేదించే పరిస్థితి పరిమితంగా ఉంటుందని, అలాంటప్పుడు ప్రతిపక్ష నేత పాత్ర నామమాత్రంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ వాదనకు కొంత బలం ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు.

అయితే జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ఈ అభిప్రాయాలతో విభేదించారు. ఈ వ్యవహారంలో పరిష్కరించాల్సిన కీలకమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉన్నాయని, వాటిని విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందువల్ల కేసును రాజ్యాంగ ధర్మాసనం ముందుకు తీసుకెళ్లడానికి తగిన కారణాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఇద్దరు న్యాయమూర్తులు విభేదించినప్పటికీ, తదుపరి ప్రక్రియపై మాత్రం ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ అంశాన్ని సీజేఐ సూర్యకాంత్ ముందుంచి, తగిన సంఖ్యలో సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. తొలుత మరో ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి పంపితే ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున నేరుగా సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

ఈ వ్యవహారం 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పు నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. అప్పట్లో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సీజేఐతో కూడిన కమిటీ ద్వారా సీఈసీ, ఈసీల నియామకానికి మధ్యంతర వ్యవస్థను నిర్దేశించింది. అనంతరం పార్లమెంట్ 2023లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చి ఆ ఎంపిక కమిటీలో సీజేఐ స్థానంలో ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చింది.తాజా పరిణామంతో 2023 చట్టంలోని నియామక విధానంపై రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు మార్గం ఏర్పడింది. అయితే చట్టం రాజ్యాంగబద్ధమా, కాదా అన్న తుది నిర్ణయం మాత్రం ఇంకా వెలువడలేదు.





# కేటీఆర్ చరిత్ర తెలుసుకో

**మొదటిపేజీ తరువాయి**

టీడీపీ నుంచి కేసీఆర్ బయటకు వచ్చారని చెప్పారు. మంత్రి పదవి ఇవ్వకుండా డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చినందుకే కేసీఆర్ టీడీపీని వీడారని వ్యాఖ్యానించారు.

కేటీఆర్ చరిత్ర తెలుసుకోవాలని చామల సూచించారు. విద్యుత్ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించే విధానానికి కాంగ్రెస్ పార్టీనే పునాది వేసిందని చెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిస్కంలపై రూ.81 వేల కోట్ల అప్పులు చేశారని చామల ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు అప్పటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు విద్యుత్ లభించే అవకాశం ఉన్నప్పటికీ ఛత్తీస్‌గఢ్‌తోనే ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని చామల అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై ఇప్పటికే విచారణలు, ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు.

భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీకి బదులుగా సబ్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించారని చామల విమర్శించారు. దీనివల్ల సుమారు రూ.వెయ్యి కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును ఓపెన్ బిడ్డింగ్ లేకుండా నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌కు అప్పగించారని చామల ఆరోపించారు. ఈ వ్యవహారంలో కమీషన్లు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చి అవినీతికి పాల్పడ్డారని అన్నారు.

మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని చామల ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ వ్యవహారాలను పక్కదారి పట్టించేందుకే బీఆర్ఎస్ విద్యుత్ సమస్యను తెరపైకి తెస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో ఎక్కడ, ఎంత అవినీతి జరిగిందనే వివరాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై చర్చ జరుగుతోందని చామల అన్నారు. దాని ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలను రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదన్నారు.

రైతులు ఎక్కువగా వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టేలా ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని చామల తెలిపారు. రైతులకు మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు చేయొద్దని బీఆర్ఎస్‌కు సూచించారు.

రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ వారిని నష్టపరిచే విధంగా వ్యవహరించవద్దని చామల అన్నారు. విపత్తు పరిస్థితుల్లో రైతులను రెచ్చగొట్టడం సరికాదని చెప్పారు. ప్రజలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని చామల ఆరోపించారు. ప్రజలు, రైతులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించిందని విమర్శించారు. తమకు ఓట్లు వేయలేదనే కారణంతో ప్రజలపై బీఆర్ఎస్ కక్ష పెంచుకుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన ఫైళ్లను ఒక్కొక్కటిగా బయటపెడతామని చామల హెచ్చరించారు. విద్యుత్ ప్రాజెక్టులు, కొనుగోళ్లు, కాంట్రాక్టుల్లో జరిగినట్లు తాము చెబుతున్న అవకతవకలకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుంచుతామని అన్నారు. రైతులకు, ప్రజలకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.





# ఈగల్ ఫోర్స్‌కు జాతీయ అవార్డు

- డ్రగ్స్ నియంత్రణలో టాప్
- తెలంగాణ పోలీసు శాఖకు జాతీయ స్థాయి గుర్తింపు
- ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యకు అత్యుత్తమ అవార్డు
- ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం
- మాదకద్రవ్యాల నిర్మూలన అందరి సమష్టి బాధ్యత
- యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలని పిలుపు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
- 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి తెలంగాణ నుంచి బలమైన అడుగు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ దేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో చేపడుతున్న చర్యలకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ఈగల్ ఫోర్స్ సాధించిన అవార్డుపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ మూడో జాతీయ సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, ఈగల్ ఫోర్స్ పనితీరుకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని సీఎం పేర్కొన్నారు. ఈ అవార్డు రాష్ట్ర పోలీసు శాఖతో పాటు తెలంగాణకు గర్వకారణమని అన్నారు.మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలకు జాతీయ స్థాయి గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని చెప్పారు.

డ్రగ్స్ నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, పాఠశాల, సంస్థ, పౌరుడి సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని చెబుతూ వారిని డ్రగ్స్ ప్రభావం నుంచి రక్షించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. డ్రగ్స్ విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మాదకద్రవ్యాల వ్యాప్తిని ప్రారంభ దశలోనే అడ్డుకోవడానికి ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు.

'నషా ముక్త్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగించాలని అన్నారు.

యువతలో డ్రగ్స్‌పై అవగాహన పెంచడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు చైతన్య కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. అక్రమ రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈగల్ ఫోర్స్‌కు లభించిన జాతీయ స్థాయి గుర్తింపును స్ఫూర్తిగా తీసుకుని మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలను మరింత విస్తృతం చేయాలని అధికారులను కోరారు.



# కాంగ్రెస్ వచ్చాక కరెంట్ పోయింది

**మొదటిపేజీ తరువాయి**

పాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత విద్యుత్ సరఫరాపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, విద్యుత్ సమస్యలపై పత్రికల్లోనూ కథనాలు వచ్చాయని ఆయన అన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సరిగా ఉండటం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఏ సబ్‌స్టేషన్‌లో చూసినా ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా ఉండటం లేదని వ్యాఖ్యానించారు. విద్యుత్ కోతలకు కారణం ఏమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఎల్‌నినో పరిస్థితులను కారణంగా చూపుతోందని విమర్శించారు. ఎల్‌నినో వల్ల కాదని.. 'కాంగ్‌నినో' వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు ఏర్పడ్డాయని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు నిల్వలపైనా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జెన్‌కోలో తగినంత బొగ్గు నిల్వలు లేవని ఆరోపించారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన పేర్కొన్నారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పుడు థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఎందుకు మూసివేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

విద్యుత్ ఉత్పత్తిలో మరో కీలకమైన జల వనరులపైనా కేటీఆర్ ప్రస్తావించారు. నీటి లభ్యత తగ్గడంతో జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

అయితే కేటీఆర్ చేసిన బొగ్గు నిల్వలు, సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలు, విద్యుత్ సరఫరా వ్యవధికి సంబంధించిన గణాంకాలను సంబంధిత అధికారిక గణాంకాలతో విడిగా ధ్రువీకరించాల్సి ఉంటుంది.

# పీవోకేలో పౌరులపై కాల్పులు ఆపాలి

**మొదటిపేజీ తరువాయి**

స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

'అసోసియేషన్ ఆఫ్ టెర్రర్ విక్టిమ్స్ ఇన్ కశ్మీర్' తరఫున పనిచేస్తున్న తస్లీమా అక్తర్.. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి సమావేశంలో ఈ అంశాలను ప్రస్తావించారు. ఇటీవల పీవోకేలో ఆర్థిక, పాలనాపరమైన సమస్యలపై శాంతియుత నిరసనలు జరిగాయని తెలిపారు.

ఈ నిరసనలను పాకిస్థాన్ ప్రభుత్వం అణచివేసిందని తస్లీమా అక్తర్ ఆరోపించారు. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేశారని చెప్పారు. పలువురు కీలక నేతలను నిర్బంధించారని పేర్కొన్నారు. నిరసనల సమయంలో ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారని ఆరోపించారు.

నిరసనలు హింసాత్మకంగా మారిన సందర్భాల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తస్లీమా అక్తర్ తెలిపారు. పాకిస్థాన్ బలగాల ప్రతీకార చర్యలు, పౌరుల హత్యలను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

పీవోకేలో సమాచార వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని ఆమె కోరారు. అక్కడి పరిస్థితులపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి సమాచార మార్పిడి అవసరమని పేర్కొన్నారు. పీవోకేలో మానవ హక్కుల పరిస్థితిపై యూఎన్‌హెచ్‌ఆర్సీ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మరోవైపు జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తస్లీమా అక్తర్ పేర్కొన్నారు. పీవోకే పరిస్థితులతో పోలిస్తే జమ్మూకశ్మీర్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు.

నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో యువతకు అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి కల్పనతో పాటు స్థానిక వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. స్మార్ట్ సిటీ కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇవి ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతమిస్తున్నాయని తెలిపారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాస్వరం,మేడ్చల్:**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకుల బావి చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. చౌరస్తా సమీపంలో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన వివరాలు, పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ వ్యక్తి ఎవరనే విషయంపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.




# ఎస్పీ శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో వైస్ చైర్మన్ నరేష్ గౌడ్

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం)**

ఎస్పీ శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివరామకృష్ణతో పాటు నాయకులు సిద్ధిరాములు, సంతోష్, సాయిరెడ్డి తదితరులు పాల్గొని ఎస్పీ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాక రైతాంగం కన్నీళ్లు పెడుతోంది

- **నీళ్లు ఉన్నా రైతులకు సాగునీరు అందడం లేదన్న హరీశ్ రావు**
- **కేఎల్ఐ మోటార్లను పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్**
- **గోదావరి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శ**
- **288 టీఎంసీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకవర్గాల చేతగానితనం వల్లే రైతాంగం కన్నీళ్లు పెట్టాల్సిన పరిస్థితి దాపురించిందని, నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ ఎత్తిపోయకుండా 'క్రాప్ హాలిడే' పేరిట రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రకృతి లేదా కాలం తెచ్చిన కరువు కాదని, కేవలం కాంగ్రెస్ పాలకులు తెచ్చిన 'కృత్రిమ కరువు' అని ఆయన అభివర్ణించారు. గత ముప్పై ఏళ్లలో పూర్తికాని ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పరుగులు పెట్టించి, ఆయకట్టును 26 వేల ఎకరాల నుంచి ఏకంగా ఆరున్నర లక్షల ఎకరాలకు పెంచిందని గుర్తుచేశారు.

**నీళ్లు ఉన్నా ఎత్తిపోతల నిలిపివేత.. గురుదక్షిణ చెల్లిస్తున్నారా?**

కేఎల్ఐ (KLI) ప్రాజెక్టులో మొత్తం 5 మోటార్లు ఉంటే కేవలం ఒకటి లేదా రెండు, మహా అయితే మూడు మోటార్లను మాత్రమే రోజుకు 8 గంటలు నడిపిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మూడు మోటార్లను 24 గంటల పాటు నిరంతరాయంగా నడిపిస్తే పాలమూరు జిల్లాకు ప్రతిరోజూ 2,400 క్యూసెక్కుల నీటిని అందించవచ్చని, కానీ కేవలం 800 క్యూసెక్కుల నీటితో సరిపెడుతున్నారని విమర్శించారు. 4,000 క్యూసెక్కుల నీటిని తీసుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ, శ్రీశైలంలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ నీటిని ఎందుకు ఎత్తడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు 800 కిలోమీటర్ల దూరం నీళ్లను తీసుకెళ్లి కుప్పంలో పారిస్తుంటే, మన సీఎం మాత్రం సొంత జిల్లాకు నీళ్లు పారించలేకపోతున్నారని, తన రాజకీయ గురువుకు తక్కువ పడకూడదనే ఉద్దేశంతోనే ఇలా 'గురుదక్షిణ' చెల్లిస్తున్నారా అని ఎద్దేవా చేశారు.

**గోదావరి ప్రాజెక్టుల నిర్లక్ష్యం.. బాహుబలి మోటార్ల నిర్వహణ లోపం**

కృష్ణా నదినే కాకుండా గోదావరి జలాల విషయంలోనూ ప్రభుత్వం ఇదే రకమైన అజ్ఞానాన్ని ప్రదర్శిస్తోందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమ్మక్క బ్యారేజ్ నిర్మించి ఏడాదిలో 365 రోజులు నీళ్లు ఎత్తిపోశామని వివరించారు. దేవాదుల వద్ద రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే నీటిని ఎత్తడం వల్ల వరంగల్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అర టీఎంసీ నీటిని ఎత్తిపోస్తే వరంగల్ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో 145 మెగావాట్ల బాహుబలి మోటార్లను ప్రారంభించి, రూ.30 వేల కోట్లు ఖర్చు చేసి 50 టీఎంసీల సామర్థ్యంతో నాలుగు రిజర్వాయర్లు నిర్మించి ప్రభుత్వానికి అప్పగించామని తెలిపారు. ప్యాకేజీ3లో 33 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనిని పూర్తి చేయకపోవడం వల్ల 50 టీఎంసీల నీటిని కోల్పోయామని విమర్శించారు. అలాగే పెద్ద మోటార్లను తరచూ ఆన్ , ఆఫ్ చేయకూడదని నిపుణులు హెచ్చరించినప్పటికీ వినిపించుకోకపోవడం వల్లే ఇప్పటికే ఒక మోటార్ కాలిపోయిందని, ప్యాకేజీ3 పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కరివెన వరకు రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

288 టీఎంసీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆచరణ సాధ్యం కాని మాటలు చెబుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. వాస్తవంగా 8.8 టీఎంసీల నీటిని మాత్రమే



ఎత్తిపోసి, ఏకంగా 88 టీఎంసీలు ఎత్తామని అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నదిలో తెలంగాణకు ఉన్న 34 శాతం తాత్కాలిక వాటాను ట్రిబ్యునల్ ద్వారా దక్కించుకోలేక, కేవలం 24 నుండి 25 శాతం మాత్రమే వాడుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు 288 టీఎంసీల నీటిని ఎక్కడ, ఎలా వాడిందో ప్రజలకు స్పష్టతనిస్తూ తక్షణమే శ్వేత పత్రం (White Paper) విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద క్రాప్ హాలిడే ప్రకటించడం ద్వారా పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల ప్రజలను దారుణంగా వంచించారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# పీఎంఏవై కింద రాష్ట్రానికి 2 లక్షల ఇళ్లు....

- **పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం....**
- **జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్...**

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. పేద ప్రజలందరికీ సొంత నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. పీఎంఏవై ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను అర్హులైన పేదలకు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, సర్పంచ్ వీణ, కౌన్సిలర్ లు పబ్బ రాజమణి, ఇప్ప అఖిల భరత్, మహిళ మోర్చా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికా, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గ్యాన్సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# జవహర్ నగర్ పోలీసుల గణేష్ సురక్ష సంకల్ప్

- **గణేష్ మండపాల వద్ద 9 రోజులపాటు వివిధ అంశాలపై ప్రత్యేక అవగాహన**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 23, (ప్రజాస్వరం)**

గణేష్ సురక్ష సంకల్ప్ 2026 సందర్భంగా సుమతి ఐపీఎస్ మల్కాజ్గిరి కమిషనర్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15వ తేదీ నుండి 23వరకు ప్రతిరోజు గణేష్ మండపాల వద్ద వివిధ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 15,16 తేదీలలో యాంటీ డ్రగ్స్17 ,18తేదీలలో ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ 19,20 తేదీలలో ఉమెన్ సేఫ్టీ ,షీ టీం మీద 21,22 తేదీలలో సైబర్ సేఫ్టీ మీద 23వ తేదీ నాడు ఫుడ్ సేఫ్టీ అండ్ ఫుడ్ అలెర్ట్రేషన్ మీద ప్రజలకు వివిధ గణేష్ మండపాల వద్ద సమావేశం నిర్వహించి ప్రజలకుఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి, జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదులు,అదేవిధంగా పోలీస్ స్టేషన్ సెక్టార్ ఎస్సైలు,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.






# పేకాట స్థావరం పై పోలీసుల దాడి ముగ్గురు వ్యక్తుల అరెస్టు

**జవహర్ నగర్, సెప్టెంబర్ 23,(ప్రజాస్వరం):**

జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను జవహర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కే. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో గోశాల సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారని సమాచారం సంఘటన స్థలానికి చేరుకోగా పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులురవి,నాగరాజు, రాజు అక్కడి నుంచి పారిపోయారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులైన పిట్టల బాలయ్య,ఎర్రగుంట రాజు,దేవరుప్పుల మహేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుండి 02 సెట్ల ప్లేయింగ్ కార్డులు 6950 రూపాయల నగదు,2 మొబైల్ ఫోన్లు 03 ద్విచక్ర వాహనాలను స్వాధీనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.




# విజయ డెయిరీ నూతన కార్యవర్గానికి సన్మానం

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం)**

విజయ డెయిరీ ఎంసీసీ మెదక్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పాల ఉత్పత్తిదారులు, డెయిరీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడిగా బాన్సువాడ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మైలారం రవి, కోశాధికారిగా శేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా సాయిరెడ్డి, సలహాదారులుగా గోపాల్, వెంకట్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు.

నూతన కార్యవర్గం పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ విజయ డెయిరీ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులు, సహకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షురాలిగా గంగా సౌజన్య రూపేష్

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షురాలిగా గంగా సౌజన్య రూపేష్ ను జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె కు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కలకి నాగరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పట్ల మల్లిక అశోక్, బీజేపీ కౌన్సిలర్లు ఇప్ప అఖిల భరత్, పప్పరాజమని లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.





## మాచవరంలో భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు

**మెదక్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం).**

మెదక్ మండల పరిధిలోని మాచావరం గ్రామంలో గణపతి పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు హోమం నిర్వహించారు. భక్తులు నక్షత్ర హారతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి పూజలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గణపతి కమిటీ సభ్యులు. సర్పంచ్ సాంబశివరావు , బెల్లం శ్రీనివాస్ గ్రామ పెద్దలు తదితరులున్నారు





## ప్రిన్సిపాల్ వర్సెస్ అసోసియేషన్ అధ్యక్షుడు....

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివాదం..**
- **చర్చనీయాంశంగా మారిన పరిణామాలు.....**

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం)**




మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కళాశాల ప్రిన్సిపాల్, అసోసియేషన్ అధ్యక్షుడి మధ్య నెలకొన్న విభేదాలే తాజా పరిణామాలకు కారణమని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. వీరి మధ్య కొనసాగుతున్న వివాదం క్రమంగా కళాశాల పరిపాలనా వ్యవహారాలపై ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కళాశాల పరిధిలో దాడులు, కేసులు, విచారణలకు దారి తీసిన ఘటనలు చోటుచేసుకోవడంతో ఈ వ్యవహారం మరింత చర్చకు దారి తీసింది. గత 12 సంవత్సరాలుగా అక్కడే పని చేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు పై ఎంతో మంది ప్రిన్సిపాల్ లతో ఇక్కడే చేసిన ఎప్పుడు లేని ఆరోపణలు ఇపుడే ఎందుకు వస్తున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కళాశాల లో వేరే ఏ సంఘటనలు జరుగుతున్న వారి విషయాల్లో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ అతని పై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని అసోసియేషన్ అధ్యక్షుడు మనోవేదన కు గురిచేస్తుంది. వ్యక్తిగత విభేదాలు విద్యా సంస్థ వాతావరణాన్ని ప్రభావితం చేయకుండా సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు. విద్యార్థుల చదువులు, భవిష్యత్తుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా కళాశాలలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత సమస్యలను పక్కన పెట్టి కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. ఈ వ్యవహారం పై అధికారులు స్పష్టతనిచ్చి, సంఘటనల పై నిజ నిర్ధన కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సంజూ శాంసన్ విషయంలో ఆ రాత్రి నిద్రపోలేదు

- **సంజూను తప్పించడంపై మనసు విప్పిన హెడ్ కోచ్ గంభీర్**
- **ఆ నిర్ణయం తీసుకున్న రాత్రి నిద్రపట్టలేదని వెల్లడి**
- **సోషల్ మీడియా చూసి తుది జట్టును నిర్ణయించబోమని వ్యాఖ్య**
- **కొన్ని ఓటములకే అనుభవజ్ఞులను పక్కనపెట్టలేమని స్పష్టీకరణ**
- **కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిస్వార్థం గొప్ప లక్షణమంటూ ప్రశంస**

**ప్రజాస్వరం :**




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించడం తన రెండేళ్ల కోచింగ్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన నిర్ణయమని, ఆ రాత్రి తాను నిద్ర కూడా పోలేకపోయానని తెలిపాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు జియోస్టార్‌తో మాట్లాడుతూ గౌతీ ఈ వ్యాఖ్యలు చేశాడు.

ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌ను, ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ అనంతరం జట్టు నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అతని స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇచ్చారు. అయితే, ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చిన సంజూ, వరుసగా అర్ధ శతకాలతో సత్తా చాటాడు.

ఈ నిర్ణయంపై గంభీర్ మాట్లాడుతూ.. "నా రెండేళ్ల కోచింగ్ ప్రయాణంలో ఆ ఒక్క రాత్రే నేను నిద్రపోలేకపోయాను. ఈ విషయాన్ని నేను సంజూతోనే చెప్పాను. ఎందుకంటే టీ20 ఫార్మాట్‌లో నా కోచింగ్ కెరీర్‌లో అది అత్యంత కఠినమైన నిర్ణయం. ప్రపంచకప్ హీరో అయిన ఆటగాడిని కేవలం మూడు, నాలుగు మ్యాచ్‌ల తర్వాత పక్కనపెట్టాల్సి వచ్చింది. ఆ సమయంలో వైభవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సిరీస్ గెలవాలంటే మాకు టాపార్డర్‌లో పరుగులు అవసరమయ్యాయి. సంజూతో నేను చాలా నిజాయతీగా మాట్లాడాను. అతను కూడా దాన్ని సానుకూలంగా స్వీకరించాడు" అని వివరించాడు.

అదే సమయంలో వైభవ్ వంటి యువ ఆటగాళ్లు తమ అవకాశం కోసం వేచి ఉండాలని గంభీర్ స్పష్టం చేశాడు. "సోషల్ మీడియా లేదా బయటి గోల తుది జట్టును నిర్ణయించదు. డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్, కోచ్ కలిసి.. ఎవరైతే మ్యాచ్ గెలిపిస్తారని భావిస్తామో వారికే అవకాశం ఇస్తాం. రెండు సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లను కొన్ని వైఫల్యాలకే పక్కనపెట్టి, డ్రెస్సింగ్ రూమ్‌లో అభద్రతాభావాన్ని సృష్టించలేం. ప్రజాదరణ పొందే నిర్ణయాలు తీసుకోవడం సులభం, కానీ సరైన నిర్ణయాలు తీసుకోవడమే కష్టం. మేము సరైన నిర్ణయమే తీసుకున్నాం" అని గంభీర్ పేర్కొన్నాడు.

ఈ సందర్భంగా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. 'కేకేఆర్ కెప్టెన్‌గా శ్రేయస్‌లో నాకు నచ్చిన ప్రధాన లక్షణం అతని నిస్వార్థం. జట్టు ప్రయోజనాల కోసం తన నాలుగో బ్యాటింగ్ స్థానాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధపడేవాడు. ఒక కెప్టెన్ ఇలా చేయడం చాలా అరుదు. ఒక మంచి నాయకుడికి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం నిస్వార్థం. అది శ్రేయస్‌లో పుష్కలంగా ఉంది" అని కొనియాడాడు. ఒకటి రెండు ఓటములతో జట్టును అంచనా వేయలేమని, జట్టులో కొనసాగింపు చాలా ముఖ్యమని గంభీర్ స్పష్టం చేశాడు.

## వైభవ్‌కు అసలు పరీక్ష అక్కడే..
## న్యూజిలాండ్ కోచ్ వాల్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు

- **బౌన్సీ పిచ్‌లపై అతడి ఆటను చూడాలనుందన్న వాల్టర్**
- **ఒత్తిడిలో వైభవ్ ఎలా స్పందిస్తాడో తెలుసుకోవాలనుకుంటున్నట్లు వెల్లడి**
- **న్యూజిలాండ్ పరిస్థితుల్లో వైభవ్‌కు ఎలా బౌలింగ్ వేయాలా అని ఆలోచిస్తున్నట్లు వ్యాఖ్య**
- **అక్టోబర్ 22 నుంచి భారత్-న్యూజిలాండ్ టీ20 సిరీస్**
- **2027 ప్రపంచకప్‌కు స్పష్టమైన ప్రణాళిక ఉందన్న కోచ్**

**ప్రజాస్వరం :**

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అసలు పరీక్ష ఎదురుకానుందా? బౌన్సీ పిచ్‌లపై అతడి బ్యాటింగ్‌ను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. అంతేకాదు.. ఓ కోచ్‌గా వైభవ్‌ను కాస్త ఒత్తిడిలో చూసి, అలాంటి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడో తెలుసుకోవాలని రహస్యంగా కోరుకుంటున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

ఐపీఎల్ 2025, 2026 సీజన్లలో విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది అండర్19 ప్రపంచకప్‌లోనూ సత్తా చాటాడు. దాంతో జులైలో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20లు, జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడికి చోటు దక్కలేదు. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం వస్తే.. న్యూజిలాండ్ సీమ్ అనుకూల పరిస్థితుల్లో అతడి ఆటకు గట్టి పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది.

"బౌన్సీ వికెట్లపై వేగంగా వచ్చే బంతులను వైభవ్ ఎలా ఎదుర్కొంటాడో చూడాలని ఉంది. ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లపై అతడు ఆధిపత్యం చెలాయించడం చూశాం. ఇప్పుడు భిన్నమైన పరిస్థితుల్లో అది ఎలా మారుతుందో చూడాలి. మా పరిస్థితుల్లో అతడికి ఎలా బౌలింగ్ చేయాలో కూడా ఆలోచించాలి. ఓ కోచ్‌గా రహస్యంగా ఆటగాళ్లను కాస్త ఒత్తిడిలో చూడాలని అనుకుంటాం. అలాంటి పరిస్థితుల్లో వారు ఎలా స్పందిస్తారో తెలుసుకోవాలని ఉంటుంది" అని వాల్టర్ చెప్పారు.

భారత్‌తో ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమేనని వాల్టర్ అన్నారు. స్వదేశంలో ప్రపంచకప్ విజేత భారత్‌తో ఐదు టీ20లు ఆడటం తమ ఆటగాళ్లకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఎదురైన ఓటమి గురించి స్పందిస్తూ.. అది ఉన్నప్పటికీ ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన లేదన్నారు. న్యూజిలాండ్ తరఫున గర్వంగా ఆడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళిక ఇప్పటికే స్పష్టంగా ఉందని వాల్టర్ తెలిపారు. రాబోయే ఏడాదిన్నరలో అవసరమైన చిన్న మార్పులు మాత్రమే చేస్తామని చెప్పారు.




## వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది

- **2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడాలని రింకూ ఆకాంక్ష**
- **ఇద్దరూ భారత్‌ను ప్రపంచకప్ గెలిపించాలని కోరుకున్న బ్యాటర్**
- **తనను ఐదు సిక్సర్లతో గుర్తించొద్దన్న రింకూ**
- **ప్రపంచకప్ విజయాల్లో భాగం కావడమే తన లక్ష్యమని స్పష్టీకరణ**
- **టెస్టుల్లోనూ భారత్‌కు ఆడాలన్నది తన కల అని వెల్లడి**

**ప్రజాస్వరం :**




విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు.

"విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం'' అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు.

ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరపున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరపున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరపున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు.

రకెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999